# ఏకాంతం ఒక వరం..!!

మనిషికి మనసు ఒక వరం. మనసుకు చింతన ఒక శాపం. ఒక్కోసారి మనసు మానస సరోవరం అయితే, ఒక్కోసారి సరస్సులకు రహదారిగా మారి పుష్పక విమానమవుతుంది. ఆలోచన అలజడి జీవితా నౌకను కుదిపేస్తున్న సమయంలో కుదురు కోసం ప్రతి మనిషి కోరుకునేది ఏకాంత వాసాన్నే! అలకలు పులకలు తీరేవేళ మనసు కూపస్థ మండూకమయితే చిత్రాల చింత ఒకింత తీరేదాకా కోపగృహవాసానికి పూర్వకాలంలో వెసులుబాట్లు ఉండేవట. ఎవరి ఏడుపు వారిని ఏడవనిచ్చే ఏకాంత సౌలభ్యం ఇప్పుడెక్కడ? ఆనందానికి హద్దులు లేవు. హృదిని కరిగించి మరిగించే విషాద భరిత స్థితికి ఏకాంతమే కూడలి స్థలి. తనను వీడి వెళ్ళిన మోహన మూర్తిని తలిచి వగచి వగచి అశ్రు ధారలో సొమ్మసిల్లిన యశోధరది ఏకాంతమే! ప్రాణనాథుని నిష్క్రమణతో అంతఃపుర మందిరానికే పరిమితమయిన నిద్రాముద్రిత రాకుమారి ఊర్మిళాదేవిదే ఇదే పరిస్థితి. కావ్యరచనకు అనువూ నెలవూ ఏకాంతమన్నది నాటి అల్లసానివారి భావమైతే ఏకాంతంగా ఆకాశాంలో వీక్షించేను. దేహాలు ఒక్కచోటే నివసిస్తాయి కానీ మనసులు మాత్రం ప్రపంచాన్ని చుట్టి వస్తాయి.

అందులోనే అనేకానేక మాటలు, ధ్వనులు భాషలూ! ఇక ఏకాంతమంటే ఏమిటి? నలుగురిలోనికి చేరకుండా దూరంగా ఉండటమా? లేక ఒంలరి తనాన్ని అలవాటు పడటమా? మోదమంటే లభించేది, ప్రమోదమంటే అనుభవించేది వీటి మధ్య వెల్లివిరిసే ఆనందోత్సాహాల్ని నలుగురితోనూ పంచుకోవాలనుకుంటాడు మనిషి. అప్పటి అనుభూతిని మాత్రం ఒక్కడే స్మరించుకుంటాడు.

గదిలో ఒక్కరే ఉంటే అది ఏకాంతం కాదు. ఎందుకంటే ఆ ఏకాంతానికి కాస్తంత భంగం కలిగినా భరించలేరెవ్వరూ. గదిలో ఉన్నపుడు చుట్టూ ఆవరిస్తుంది ఏకాంతం. దాటగానే మనల్ని మనమే కాదనుకుని సమాజంలో కలసిపోతాము. ఏకాంతం అనేది స్థిరచిత్తాన్ని కలుగజేస్తుంది. ఎంతోమంది ఇష్టపడే ఏకాంతాన్ని మనమే ఒక్కోసారి భగ్నం చేస్తాము. ఈ యాంత్రిక యుగంలో కాల ప్రవాహంలో కాస్తంత శాంతి విశ్రాంతి అందించేది ఏకాంతంలోనే కదా? నిత్యం జీవిత భ్రమణంలో అనేకానేక అనుభవాల్ని పొందే ఎవ్వరికైనా ఎక్కడో ఒక దగ్గర ఎంతోకొంత సమయం ఏకాంత చిత్తులు కాగలిగితే సరికొత్త జవమూ జీవమూ ప్రాప్తిస్తుందని సారాంశం. పరిశీలించి చూడాలే కానీ సోమసుందర్ కలం పలికినట్లు పరమాణువు కన్నా యెదద నిజం సుమా అన్నట్లు / లేడికి లేచిందే పరుగు అన్నట్లు క్షణం తీరిక లేకుండా గడిపే యుతకు ఏకాంతత్వమే ఉత్తమ ఫలదాయకమని సామాజిక పరిశీలకుల విశ్లేషణలు ఇపుడే వెల్లడించాయి. ఆ రీత్యా చూసినపుడు ఎవరికైనా ఏకాంతమే ఆత్మబంధువు అనుకుంటారేమో! కానీ ఏకాంతం అనేది మనల్ని మనకు తెలిపేది. ఏకాంతం అనేది అనుకూలంగా మార్చుకుంటే మనకోసమే మిగిలేది. ఏకాంతంతో మునులు, ఋషులు సాధించేది చాలా ఉంటుంది. ఏకాంతం అనేది ఒక శక్తి. మాటల మధ్య మనం కోల్పోయిన ఆత్మీయతలెన్నో! ఏకాంతంలో అలవడిన మౌనంతో సాధించే అనుభూతులెన్నో!!

నేటినిజం
ఆదివారం 19-1-2020

## చురుకుగా పనిచేస్తున్న ఇసి

### మద్యం,డబ్బు పంపిణీపై నజర్

### తనిఖీలను ముమ్మరం చేసిన అధికారులు

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో ఇసి చురుకుగా పనిచేస్తోంది. అభ్యర్థుల ఖర్చులను ఆరా తీయడంతో పాటు ఎన్నికల్లో మద్యం, డబ్బులు ప్రభావితం చేయకుండా ఉండేందుకు అడుగడుగునా తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఆదివారంతో ప్రచార పర్వం పూర్తి కానుండడంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒక ఫ్లయింగ్ స్కాడ్‌తో పాటు ఒక ఎస్ఎస్ బృందాన్ని తనిఖీల కోసం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే దారుల్లో ఎస్ఎస్‌టీలను ఏర్పాటు చేసి అనుక్షణం తనిఖీ లు చేస్తున్నారు. ఫ్లయింగ్ స్కాడ్ బృందంలో తహసీల్దార్‌తో పాటు ఏఎస్పై స్థాయి అధికారి ఇద్దరు పోలీసులు మరో వీడియోగ్రాఫర్ ఉంటున్నారు. ప్రతి తనిఖీని వీడియో తీయడం ద్వారా పారదర్శకతను అధికారులు పాటిస్తున్నారు. దీనికి తో డు మున్సిపాలిటిలోకి ప్రవేశించే ప్రధాన రహదారుల్లో ఎస్ఎస్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

పురుపోరులో అక్రమాలను నియంత్రించడానికి మూడు ఫ్లయింగ్ స్కాడ్, మరో మూడు ఎస్ఎస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఈ బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. వీటితో పాటు స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు మూడు పురపాలక సంఘాల్లో ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాయి. రహదారులపై ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు తనిఖీలు చేస్తున్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురి కావద్దని,మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని పోలీసులు కూడా ప్రచారం చేస్తున్నాయి. పోలీసు అధికారుల బృందాలు వార్డుల్లో పర్యటిస్తున్నాయి. మద్యం, డబ్బు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.. ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేలా ప్రజలు సహకరించాలని కోరుతున్నారు.

## ఆదిలాబాద్ పీఠం సాధిస్తాం

### అభివృద్ధి పనులే మమ్మల్ని గెలిపిస్తాయి

### ప్రచారంలో ఎమ్మెల్యే జోగురామన్న

ఆదిలాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మెజార్టీ స్థానాలు గెలుచుకుని మరోమారు ఆదిలాబాద్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యేజోగురామన్న అన్నారు.

గెలిచే అభ్యర్థులకు బీ ఫారాలు అందజేసినట్లు టీఆర్ఎస్ ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి లోక భూమారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆదిలాబాద్‌లో జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్న ఇతర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మున్సిపల్ పరిధిలో 49 వార్డులు ఉండగా టీఆర్ఎస్ 40 నుంచి 45 వార్డుల్లో విజయం సాధిస్తుందన్నారు. వివిధ పార్టీల్లో నిర్వహించిన సర్వేలతో పాటు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థులకు బీ ఫారాలు అందజేసినట్లు తెలిపారు. పలు వార్డుల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేయడానికి ఎక్కువ మంది పోటీ పడ్డారని బీ ఫారాలు అందని వారు నిరాశచెందవద్దన్నారు. వారికి భవిష్యత్తులో మంచి పదవులు వచ్చేలా అందరం కృషి చేస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని, ఆరేండ్ల టీఆర్ఎస్ పాలనలో జిల్లా కేంద్రం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.125 కోట్లు మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులకు కేటాయించారని, దీంతో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పలు వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులతో కలిసి ముమ్మర ప్రచారం చేపట్టామని తెలిపారు. ఇదిలావుంటే ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీఆర్ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ మాజీ మండల కో–ఆప్షన్ సభ్యుడు ఇలియాస్ ఖాన్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు పార్టీలో చేరారు. పార్టీ నాయకులు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధిని ఆదరించి టీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జోగు రామన్న కోరారు. పలువురు బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదిలాబాద్ పట్టణం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదని, కోట్ల రూపాయలు తీసుకొచ్చి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పాత జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నామని, ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధిని చేసే టీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ జనార్దన్ రాథోడ్, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ జి.నగేశ్ ఇతర నాయకులు గులాబీ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేపట్టారు.

## నేటితో ముగియనున్న మున్సిపల్ ప్రచారం

### –షెడ్యూల్ ప్రకారం ప్రచారం ముగించాలి: కలెక్టర్

జనగామ,జనవరి18(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే ఈనెల 20న సాయంత్రం 5గంటల్లోగా ముగించాలని అభ్యర్థులకు, పార్టీ నేతలకు జనగామ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అభ్యర్థులు, పార్టీలకు తెలియకుండానే షాడో మఫ్టీ బృందాలు ఈ వివరాలన్నీ నమోదు చేసుకుంటాయని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు లిఖితపూర్వక ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డు సభ్యుల ఖర్చులపై ఎన్నికల సంఘం నిఘా ఉంటుందని, నిబంధనలకు లోబడి మాత్రమే పోటీలో ఉన్న అభ్యర్థులు డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు వినియోగించే పార్టీ జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు వంటి అన్ని ప్రచార సామగ్రికి సంబంధించిన ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే అభ్యర్థులపై వ్యయ పరిశీలకుడు ఇచ్చే నివేదిక ఆధారంగా గెలుపొందిన తర్వాత కూడా వారిని అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బ్యాంక్ ఖాతాల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కొంత వెసులుబాటు కల్పించిందని అయితే పాత అకౌంట్‌లో ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఎన్నికల ఖర్చుకు సంబంధించిన లావాదేవీలు తప్ప ఇతర లావాదేవీలు నిర్వహించొద్దన్నారు. వార్డుల్లో ఎన్నికల ప్రచారానికి మున్సిపల్ నుంచి అనుమతి, మైక్ పర్మిషన్ కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదట దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత క్రమంలో అనుమతి ఇస్తారని, ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు ఎప్పటికప్పుడు ఖర్చును చూపించాలని, ఎన్నికల తర్వాత గెలిచినవారు, ఓటమిపాలైన వారు కూడా లెక్కలు చూపాలని, లేదంటే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈనెల 22న నిర్వహించే మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పత్రాలను ఎన్నికల అధికారులు శుక్రవారం జనగామ ఠాణాకు చేర్చారు. ఈమేరకు సీఐ మల్లేశ్‌యాదవ్ అధ్యక్షతన బ్యాలెట్ పత్రాలను ఠాణాలో అదనపు పోలీస్ సిబ్బందితో భద్రపరిచినట్లు సీఐ వెల్లడించారు. ఎన్నికల పత్రాలను పోలింగ్ స్టేషన్లకు డిస్ట్రిబ్యూషన్ చేసే వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారులు తెలిపారు.

# రాజధాని రగడతో అభివృద్ధికి విఘాతం

హైదరాబాద్, జనవరి 18:రాజధాని రగడను కమ్మ,రెడ్ల మధ్య పోరాటంగా చిత్రీకరించడంతో ఇప్పుడు రాజధాని లేని ఎపికి పెట్టుబడులు రావడం అన్నది అనుమానంగా మారింది. దావోస్ లాంటి సదస్సుల్లో పాల్గొని ఎపిని మరింతగా ముందుకు తీసుకుని వెళ్లాల్సిన సమయంలో నెలరోజులుగా ప్రజలు చేస్తున్న ఆందోళనలను కేవలం చంద్రబాబు, ఆయన అనుచరులు సేకరించిన భూ సమస్యగా చిత్రీకరించి ముందుకు సాగడంతో సమస్య మరింత జటిలం అవుతోంది. సిఎం వైఎస్ జగన్,ఆయన మంత్రుఉల కూడా దూరాలోచన లేకుండా రాజధానిపై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని వస్తున్న విమర్శలను ఖాతరు చేయడం లేదు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం వేరు.. రాజధానిని నిర్మించుకోవడం వేరన్న ధోరణిలో లేరు. అసలు రాజధాని అంటూ ఉంటే ఆర్థికంగా దాని చుట్టూ కార్యక్రమాలు బలపడుతాయి. ఈ దశలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా చోద్యం చూస్తోంది. నెలరోజులుగా ఆందోళనలు సాగుతున్న వేళ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రం నోరు విప్పడం లేదు. యధావిధిగానే మంత్రులంతా వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోఅవినీతి కేసులలో నిందితుడిగా ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు కావడంతో విమర్శలు రెట్టింపు అయ్యాయి. మరోవైపు సిబిఐ కేసుల్లో జగన్‌కు ఏదైనా అయితే భార్య భారతి సిఎం అవుతారన్న ప్రచారం జరుగుతోంది. తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్న ప్రజలకు నమ్మకం కలిగించి వారిలో స్థయిర్యం నింపాల్సిన జగన్ అమరావతిని ఓ కుల సమస్యగా తీసుకుని ముందుకు సాగడం ఆయన సంకుచిత దృష్టికి నిదర్శనంగా గుర్తించాలి. అనేక పథకాలతో ప్రజలకు డబ్బులు పందేరం చేస్తూ ఆదాయాలపై దృష్టి పెట్టక పోవడం వల్ల రాష్ట్రం దివాళా తీయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పుడు ఆయన రాష్ట్ర భవిష్యత్తుతో ఆడుకుంటున్నారన్న విమర్శ బలంగా వినిపిస్తోంది. రాష్ట్రానికి అధికారిక రాజధాని ఏదో చెప్పకుండా మూడు ప్రాంతాల అభివృద్ధి అంటూ వివాదాలకు తెరతీసారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రాజధాని మూడు ప్రాంతాల్లో ఉండాల్సిన అవసరం లేదు. సహజ సిద్ధంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ పట్టణాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చెబుతున్న ప్రభుత్వం ముమ్ముందు విశాఖనే ప్రధాన రాజధానిగా ప్రకటించే అవకాశముంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మాణాలు పూర్తిచేసిన అమరావతి పేరుకు మాత్రమే రాజధానిగా ఉంటుందని స్పష్టం అవుతోంది. అలా చేయడం వల్ల ఎవరైనా పెట్టుబడులకు ముందుకు వస్తారా అన్నది మాట్లాడడం లేదు. ÷ాజధానిని మహానగరంగా అభివృద్ధి చేసుకోవాలన్న ఆలోచనకు స్వస్తి చెప్పి సంకుచితంగా ఆలోచించడమే అన్నింటికంటే విషాదకరం. విశాఖలో పది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మరుసటి సంవత్సరం నుంచి యేటా లక్ష కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని మంత్రి బొత్స ప్రకటించడంలో అర్థంలేదు. రాజధాని మార్పు విషయంలో వివాదం ముసురుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తోంది. జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా అప్రతిష్ఠపాలయ్యేలా చూడాలని బిజెపి మౌనం వహిస్తుందా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కేంద్రం తీరు సస్పెన్స్‌గానే ఉన్నప్పటికీ రాజధాని వివాదం మాత్రం రగులుతూనే ఉంటుంది.ప్రపంచవ్యాప్తంగా సేవలరంగం విస్తరించడంతో జాతీయ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ హైదరాబాద్‌లో కొలువుదీరాయి. ఆయా కంపెనీలకు హైదరాబాద్‌లో వందల ఎకరాలను కేటాయించడంతో అవి మరింతగా విస్తరణ పథకాలతో ముందుకు సాగు తున్నాయి. దీంతో హైదరాబాద్ ఆదాయం మరింతగా పెరగడంతో తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయంలో ఢోకా లేకుండా పోయింది. అమరావతిని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా చంద్రబాబు ప్రభుత్వం మార్చివేసిందని ఇప్పుడు విమర్శిస్తున్నవారు గతంలోనూ, ఇప్పుడూ హైదరాబాద్‌లో ఏమి జరుగుతున్నదో ఒకసారి గుర్తుచేసుకోవాలి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్‌లోని భూములనే పెట్టుబడిగా వాడారు. అంతేగానీ ఇతర ప్రాంతాల నుంచి ఆదాయాన్ని తెచ్చి హైదరాబాద్ అభివృద్ధికి ఖర్చు చేయలేదు. సరికదా ఇక్కడ రియల్ వ్యాపారం విస్తరించడంతో కూడా ఆదాయం భారీగాపెరిగింది. ఏ నగరమైనా అభివృద్ధి చెందినప్పుడు భూముల ధరలు పెరగడం సహజం. అలాంటప్పుడు ప్రభుత్వ భూముల ధర కూడా పెరుగుతుంది. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అలా హైదరాబాద్‌లో భూములు కొనుగోలు చేసినవారు కూడా లాభపడ్డారు. రాజధానికి 33 వేల ఎకరాల భూమి ఎందుకు అని ప్రశ్నించినవారు, అమరావతిని తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసుకుంటే సరిపోతుంది. అమరావతి నిర్మాణానికి లక్ష కోట్లు కావాలి.. ప్రభుత్వం వద్ద అంత డబ్బు లేదని అంటున్నవారు ఇప్పటికైనా ప్రజలను తప్పుదారి పట్టించకుండా ఉంటే మంచిది. మెల్లగా అభివృద్ధి చేసుకుంటూ పోయేందుకు రాజధానిని మార్చాల్సిన అవసరం ఉందా అన్న దానికి సమాధానం చెప్పాలి. ఉన్న ప్రాంతాని మంచి రాజధానిగా అభివృద్ధి చేసుకునేందుకు కేంద్రం నుంచి, ఇతర పారిశ్రామకవేత్తలనుంచి సాయం పొందవచ్చు. అలా అయితే అమరావతిఆదాయవనరంగా తయారవుతుంది. దీనిని వదిలి నేలవిడిచి సాము చేస్తున్న తీరు పాలకుల సంకుచిత ధోరణికి అద్దం పడుతోంది. ఈ వివాదం నుంచి బయటపడితే తప్ప ఎపి అభివృద్ధికి బాటలు పడవు.

# టిఆర్ఎస్ వ్యూహాత్మక ప్రచారం

### మున్సిపల్ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ప్రణాళిక

### చేరికలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్న వైనం

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): ఎన్నికలు ఏవైనా గెలుపే లక్ష్యంగా ఇప్పటి వరకు టిఆర్ఎస్ చేపట్టిన వ్యూహం ఫలించింది. అందులో భాగంగా ప్రతి ఎన్నికలకు ముందు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో చేరికలను ప్రోత్సహించడం ద్వారా గులాబీ పార్టీ పట్ల ప్రజలు ఆకర్శితులవుతున్నారన్న సమాచారన్ని ప్రజలకు చేరవేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయితీ ఎన్నికల ముందు ఇదే పద్దతి అవలంబించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల్లోనూ చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఊరూవాడా, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో చేరికలకు సంబంధించిన వార్తలను బాగా ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని ప్రతిపక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు అన్ని వర్గాల ప్రజలకు వరంగా మారాయని,అందుకే అంతా గులాబీ దళంతో చేరుతున్నారని మంత్రులు ప్రకటిస్తున్నారు. ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు గులాబీ పార్టీకి అండగా నిలుస్తున్నారని ప్రకటిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎక్కువ సంఖ్యలో చేరికలు జరుగుతుండడంతో ఆయా వార్డుల్లో పార్టీ మరింత బలపడనుందని అంటున్నారు.

దీంతో పలు వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు సుగుమం అయ్యేలా చేస్తున్నారు. నేతల సమక్షంలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నాయి. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, అమ్మఒడి, రూ.1 కిలో బియ్యం, రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు లాంటి వాటితో పాటు ఇతర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఫలితంగా జిల్లాలో ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు టీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలు ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా ప్రకటించారు. దీంతో ప్రతిపక్షాలు నాయకులకు ఎన్నికలంటేనే భయపడాల్సి వస్తున్నది. మున్సిపల్ ఎన్నికల్లో సైతం బల్దియాలపై మరోసారి గులాబీ జెండా ఎగురనున్నది. మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీఆర్ఎస్ నాయకులు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎంపికను పక్కాగా నిర్వహించారు. గెలిచే అభ్యర్థులను పోటీలో నిలిపారు. దీంతో పాటు ప్రచారంలో సైతం పకడ్బందీ వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు గడప, గడపకూ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో మెజార్టీ వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచే అవకాశాలున్నాయని ప్రజలు కూడా విశ్వసించేలా కార్యాచరణతో సాగుతున్నారు. పట్టణాల్లోని పలు వారుల్లో ప్రతిపక్షాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వారు గులాబీ పార్టీలోకి వస్తున్నారు. ఇటీవల పట్టణంలోని పలు వార్డులకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేల సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఫలితంగా ఆ పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపుపై ప్రభావం పడనున్నదని ప్రచారం చేస్తున్నారు. అసలు కాంగ్రెస్,బిజెపిలకు అభ్యర్థులే లేరన్న ప్రచారం మరోవైపు సాగిస్తున్నారు.

# అట్టహాసంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారం

### గడపగడపకు తిరుగుతూ ఓట్ల వేట

### మంత్రులు, ఎమ్మెల్యేలు సహా నేతలంతా ప్రచారంలోనే

వరంగల్,జనవరి18(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని టీఆర్ఎస్ నాయకులు అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నేరుగా ప్రజలను కలుస్తున్నారు. మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ సహా ఎమ్మెల్యేలు ఆయాన మున్సిపాలిటీలల్ఓ జోరుగా తిరుగుతు న్నారు. నాయకులు, వార్డుల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు, కార్యకర్తలు మున్సిపల్ పరిధిలోని విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. రోడ్‌షోలు, ఇంటింటా ప్రచారం చేసి టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా తమ ప్రాంతానికి, ఇండ్లకు వచ్చిన టీఆర్ఎస్ నాయకులకు స్థానికులు గులాబీ పార్టీకి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిఆర్ఎస్ నాయకులు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. పలు వార్డుల్లో పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన వారికి నచ్చచెప్పి ఆయా వార్డుల్లో అభ్యర్థులను గెలిపించేలా కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయా మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో తిరుగుతూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. పట్టణంలోని రోడ్ షోలు, ఇంటింటా ప్రచారం నిర్వహించే కారు గుర్తు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ఆరేళ్లుగా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. మున్సిపాలిటీ పరిధిలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రోడ్లు, మురికికాల్వలు, ఇతర పనులను స్థానికులకు తెలియజేశారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ ప్రాంతాలకు వచ్చిన టీఆర్ఎస్ నాయకులకు, అభ్యర్థులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. టీఆర్ఎస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయని, తమ ఉపాధి ఎంతగానో మెరుగుపడిందని ప్రజలు టీఆర్ఎస్ నాయకులకు వివరించారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీము బారక్, రూ.1కిలో బియ్యం, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేసీఆర్ కిట్, అమ్మఒడి లాంటి పథకాలతో పట్టణంలో అర్హులైన వారందరికి వర్తింప చేశామని చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు అండగా నిలవాలని కోరుతున్నారు. పలు వార్డుల్లో నాయకులు ప్రచారం నిర్వహించగా వివిధ వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు సైతం తమ అనుచరులతో వీధుల్లో తిరుగుతూ గడప గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

# నేడు పల్స్ పోలియో

### –జిల్లాలో విస్తృతంగా ఏర్పాట్లు

జనగామ,జనవరి18(ఆర్ఎన్ఎ): నేటి పల్స్ పోలియోకు జనగామ జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేండ్లలోపు పిల్లలందరికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏ మహేందర్ ప్రజలకు సూచించారు. పల్స్ పోలియోపై ఏర్పాటు చేసిన వైద్యాధికారి పల్స్ పోలియో బ్యానర్స్, వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియో ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొత్తంగా 42442 మంది చిన్నారులను గుర్తించడం జరిగిందని, వీరందరికి పోలియో చుక్కలను వేసేందకు 308 బృందాల్లో మొత్తంగా 1232 మంది ఉద్యోగులు పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వీటిలో 94 హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించిన ఇటుక బట్టీలు, స్లమ్స్, వ్యవసాయి క్షేత్రాల్లో ఉండే చిన్నపిల్లలకు సైతం పోలియో చుక్కలు వేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.కావున మిరందరు ఈనెల 19వ తేదినజరిగు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల మిపిల్లలకు చుక్కలు వేయించి పోలియో వ్యాధి నివారణకు సహకరిం చగలరని కోరారు.

## గెలుపు వ్యూహాల్లో గులాబీ నేతలు

### ఉమ్మడిగా కలసికట్టుగా ప్రచారం

### మూడు మున్సిపాలిటీల్లో ఊపందుకున్న జోష్

కామారెడ్డి,జనవరి18(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకు పోవడంతో పాటుగా మున్సిపాలిటీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపు అనివార్యతను నేతలంతా ప్రజల్లోకి బలంగా తీసుకుపోతున్నారు. గెలిస్తేనే నిలుస్తామని, పట్టణ అభివృద్ధి సాగాలంటే టిఆర్ఎస్ గెలవాలని నేతలు కోరుతున్నారు. టీఆర్ఎస్ ముఖ్యనాయకులంతా సమష్టిగా వార్డుల్లో విస్తృతంగా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకత్వ సూచనల ప్రకారం గులాబీ సైన్యం ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో గులాబీ జెండాను ఎగురువేయడమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను చిత్తుగా ఓడించి పురపాలక పీఠాలను కైవసం చేసుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపు ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఐదేండ్లకోసారి ఎన్నికలు వస్తున్నా రిజర్వేషన్ల అనుకూలతతో గతంలో పోటీకి అవకాశం లేనివారు ప్రస్తుతం అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రచారాన్ని ముమ్మరంగా చేయగా పోలింగ్ జరిగే ఈ నెల 22వ తేదీ వరకు పరిస్థితిని తమకు సానుకూలంగా మార్చుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈ నెల 22న పోలింగ్ ఉండగా 20వ తేదీ సాయంత్రం వరకు ప్రచారానికి అవకాశం ఉం టుంది. ప్రచారానికి మూడు రోజులే మిగిలి ఉండడంతో స్వతంత్రుల మద్దతు కోసం కొంత మంది అభ్యర్థులు తెరచాటు బేరాలు నడుపుతున్నట్లుగా తెలుస్తున్నది. వారి సహకారంతో ఓట్లను తమవైపునకు తిప్పుకునేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఓట్లు చీలిపోయి గెలుపోటములు తారుమారు అయ్యే వీలుందనే అంచనాలతో వ్యూహాలు పన్నుతున్నారు.

ఇక కాంగ్రెస్, బీజేపీలు వరుస ఎన్నికల్లో పరాజయాన్ని మూటగట్టుకోగా పురపోరులో పరువు నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణులను ఉత్సాహ పరుస్తున్నారు. అభివృద్ధి ప్రధా న అస్త్రంగా ప్రచారం చేస్తున్నారు. ఆయా చోట్ల ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ మున్సిపాలిటీ గెలుపు ఆవశ్యకతను సవివరంగా వివరిస్తున్నారు. ఇప్పటి వరకూ కామారెడ్డి అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు,చేసిన ఖర్చులను లెక్కలతో సహా వివరిస్తు న్నారు. అలాగే బాన్సువాడ ఎన్నికల ప్రచారంలో స్థానిక ఎమ్మెల్యే,శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన అభివృద్ధినే టీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ప్రధానంగా ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. ప్రోటోకాల్ ప్రకారం స్పీకర్ హోదాలో రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం లేనందున జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే,టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రూ.100 కోట్లతో చేపట్టిన ప్రతీ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకు పోతున్నారు. వీరితో పాటుగా యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలోనూ జోరుగా ప్రచారం సాగుతున్నది. బాన్సువాడ పట్టణంలో ఎమ్మెల్యే షిండేతో పాటుగా పోచారం భాస్కర్ రెడ్డిలు ముందుకు పోతున్నారు. ఇక ఎల్లారెడ్డి మున్సిపాలిటీ లోనూ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులంతా కలిసి జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులంతా ఏకధాటిపైకి వచ్చి ప్రచారాన్ని జోరుగా చేస్తున్నారు. మూడు మున్సిపాలిటీల్లో వార్డుల బరిలోని అభ్యర్థులు ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో నాయకులు ప్రచారంలో కనబరుస్తున్నారు.

## రేడియల్ రోడ్డుతో ఈ ప్రాంతానికే కొత్త రూపు

### – ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న తెల్లాపూర్ అవసరాలకు అనుగుణంగా రేడియల్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లో ఆయన మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేడియల్ రోడ్డు నిర్మాణ పనులు

త్వరలో పూర్తిచేస్తా మన్నారు. ఇప్పటికే రేడియల్ రోడ్డు సమస్య మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టిలో ఉన్నదని, ఎన్నికల అనంతరం రేడియల్ పనుల్లో వేగం పుంజుకుంటుదని తెలిపారు. రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంతానికే కొత్తశోభ వస్తుందన్నారు. గ్రామపంచాయతీగా ఉన్న తెల్లాపూర్‌ను మున్సిపాలిటీగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. మున్సిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అంజయ్యయాదవ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, ఆదర్శ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, దేవేందర్‌యాదవ్, ప్రభాకర్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రీన్ ఛాలెంజ్‌లో పాల్గొన్న కలెక్టర్ హరీష్

రంగారెడ్డి, జనవరి 18: రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ గ్రీన్ ఛాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటారు. రాజేంద్రనగర్ ఆర్.డీ.ఓ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం మరో ముగ్గురికి గ్రీన్ చాలెంజ్ ను విసిరారు. బొంబాయ్ లోని అల్ట్రాటెక్ సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్ హెడ్ రెగులపాటి రామ్మోహన్, అర్.డీ.ఓ చంద్ర కళ, రంగారెడ్డి జిల్లా ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టరు వెంకటేశ్ లకు కలెక్టర్ గ్రీన్ ఛాలెంజ్ విసిరారు. అనంతరం కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తప్పని సరిగా మొక్కలు నాటాలన్నారు. గత 100 ఏళ్లుగా క్షీణిస్తున్న వృక్ష సంపద గ్రీన్ కవరేజ్ పెంచడానికి ప్రతీ ఒక్కరు కనీసం మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు.



## ఎన్నికల ప్రచారంలో వెనక్కి తగ్గిన కెసిఆర్,కెటిఆర్

### ఇచ్చిన హామీలపై నిలదీస్తారనే భయం

### పాలమూరు ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్

మహబూబ్‌నగర్,జనవరి18(ఆర్ఎన్ఎ): నల్లధనంతో ఎన్నికలను శాసించే సంస్కృతికి టీఆర్ఎస్ తెరలేపిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. ఎన్నికల్లో టీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కాయని అన్నారు. పాలమూరును ఎంఐఎంకు కట్టబెట్టాలని చూస్తున్నారని సిఎం కెసిఆర్‌పై మండిపడ్డారు. శుక్రవారం ఆయన పాలమూరు,భూత్పూర్‌లో ప్రచారం నిర్వహించారు. మాజీమంత్రులు డికె అరుణ, పి.చంద్రశేఖర్‌లతో కలసి జోరుగా ప్రచారం నిర్వహించారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటంతోనే కేసీఆర్, కేటీఆర్‌లు మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారని దుయ్యబట్టారు. దొడ్డిదారిన మేయర్,మున్సిపల్ ఛైర్మన్ పదవులను దక్కించు కోవాలనే కుట్రతో ప్రభుత్వం ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లటం లేదని వ్యాఖ్యానించారు. మద్యం, మైనింగ్,ఇసుక మాఫియాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభ్యర్థులు అమ్ముడు పోతారని, టీఆర్ఎస్ కు ఓటేస్తే మజ్లీస్ కు తాకట్టు పెడతారని మండిపడ్డారు. ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీని గెలిపిస్తే కేంద్రం నిధులతో పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో టీఆర్ఎస్ ఆరేళ్ల పాలనపై బీజేపీ చార్జ్‌షీట్ విడుదల చేసింది. ఆరేళ్లలో టీఆర్ఎస్ పాలనలో పురపాలికలు నిధులు లేక పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ఆరోపించింది. ఇప్పటివరకు సీఎం కేసీఆర్ మాయమాటలు నమ్మి ప్రజలు టీఆర్ఎస్‌కు ఓట్లు వేశారని, ఇప్పుడు మళ్లీ టీఆర్ఎస్‌కు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నిస్తూ బీజేపీ ముందుకు వెళుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. కనీసం ఈ ఎన్నికల్లోనైనా మోసపోకుండా ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్నామన్నారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధి విషయంలో టీఆర్ఎస్ వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలో పాతబస్తీకే పరిమితమైన ఎంఐఎం టీఆర్ఎస్ అండతోనే ఇప్పుడు మున్సిపాలిటీలపై కన్నేసిందన్నారు. ఎంఐఎం అజెండాను అమలు చేస్తున్న టీఆర్ఎస్‌కు ప్రజలు ఈ ఎన్నికల్లో ఓట్లు వేయవద్దన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓటు వేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే సమస్య లేదని, కాబట్టి ఈ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేయాలన్నారు. పట్టణాలను డల్లాస్‌లా తయారు చేస్తామని, హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లలా చేస్తామన్న కేసీఆర్ మాటలు ఏమయ్యాయని లక్ష్మణ్ ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన నిధులే పట్టణాలను ఆదుకుంటున్నది వాస్తవమా.. కాదా.. అన్నది కేటీఆర్ చెప్పాలన్నారు.

## భైంసాలో కొనసాగుతున్న 144 సెక్షన్

### పరిస్థితి అదుపులో ఉందన్న హోంమంత్రి

నిర్మల్,జనవరి18(ఆర్ఎన్ఎ): జిల్లాలోని భైంసాలో 144 సెక్షన్ ఐదో రోజు కొనసాగుతోంది. గత ఆదివారం పట్టణంలోని కోర్బాగల్లీలో ఇరు వర్గాల ఘర్షణ రాళ్లదాడికి దారితీయడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్నెట్, మొబైల్ సేవలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కావడంతో అన్ని ప్రార్థనా మందిరాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ రేంజ్ ఐజీ నాగిరెడ్డి నిర్మల్ నుంచి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రచారానికి ప్రత్యేక అనుమతులు లభించినట్టు తెలిసింది. ఇదిలావుంటే

భైంసాలో ప్రస్తుతం ప్రశాంతమైన వాతావరణం నెలకొందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఎలాంటి ఆందోళనలు లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. భైంసాలో పరిస్థితులు బాగోలేవనే వార్తలు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నాయి తప్ప అక్కడ ఎలాంటి అలజడి లేదని పేర్కొన్నారు. ఇక కేసులు ఉన్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల్ని డిపార్ట్‌మెంట్‌లో చేర్చుకోబోమని హోంమంత్రి స్పష్టం చేశారు. 300 మంది కానిస్టేబుల్ అభ్యర్థులపై ఉన్న కేసులపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. అన్ని విధాలుగా విచారణ చేసిన అనంతరమే వారిని పోలీసు శాఖలో జాయిన్ చేసుకుంటామని పేర్కొన్నారు.

## నా కూతురు మరణాన్ని రాజకీయం చేయొద్దు

### రాజకీయ పార్టీలకు నిర్భయ తల్లి కన్నీటి వేడుకోలు

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): తన కూతురి మరణాన్ని అపహాస్యం చేయవద్దని కన్నీళ్లతో రాజకీయ పార్టీలను వేడుకుంటున్నానని నిర్భయ తల్లి ఆషాదేవి అన్నారు. నా కూతురిని చంపిన వారికి వేలకొద్దీ అవకాశాలు లభిస్తున్నాయి. కానీ మాకు ఏ హక్కులు లేవా? అని ప్రశ్నించారు. ఇన్నేళ్లలో నేను ఇంతవరకు రాజకీయాల గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదు. అయితే ఒక్క విషయం..2012లో ఎవరైతే నా కూతురి కోసం వీధుల్లోకి నిరసనలు చేశారో..ఈ రోజు వాళ్లే నా కూతురి చావును అడ్డం పెట్టుకొని రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. 2014లో అధికారంలో వస్తే మహిళలపై దాడులు జరగవని చెప్పారు. రెండోసారి కూడా అధికారం చేపట్టి వేల కొద్దీ పనులు చేశారు. ట్రిపుల్ తలాక్ వంటి కీలక అంశాల్లో నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా నా కూతురి విషయంలో కూడా త్వరగా నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని బిజెపి ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి చేతులు జోడించి అభ్యర్థిస్తున్నాను అని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఇక నిర్భయ అత్యాచార నిందితుల్లో ఒకడైన ముఖేష్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిర్ణయం తీసుకున్నారు.

## సిమ్లాలో కనువిందు చేస్తున్న హిమపాతం

సిమ్లా,జనవరి18(ఆర్ఎన్ఎ): మండి జిల్లాలోని జంజేహ్లి ప్రాంతంలో హిమపాతం తుంపర్లుగా పడుతూ పర్యాటకులకు కనువిందు చేస్తోంది. హిమాచల్ క్యాపిటల్ సిటీ సిమ్లాతోపాటు ప్రఖ్యాత పర్యాటక క్షేత్రం కుఫ్రిలో హిమపాతం కురుస్తూనే ఉంది. ఇప్పటికే కాంగ్రాలో అత్యధికంగా 18.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా..చంబా, డల్హౌసీలో 7 మి.మీల వర్షపాతం (మంచువర్షం), జుంగీలో 2మి.మీ, జ్వాలి 1 మి.మీ, సిమ్లాలో 0.8 మిమీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు మండి జిల్లాలోని సీరజ్ వ్యాలీలో పర్యాటకాన్ని మరింత అభివఅద్ధి చేసేందుకు టూరిజం శాఖ రెండు ఇగ్లూ (మంచు ఇల్లు)లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది.

## టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం

### మూడు కార్లను ఢీకొనడంతో ధ్వంసం

యాదాద్రి,జనవరి18(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా అదుపు కోల్పోయిన బస్సు టోల్‌ఎ÷-లాజా వద్ద ఆగిన వరుస వెంబడి కార్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. అయితే, అదృష్టవశాత్తు ఎవరూ ఈ ఘటనలో గాయపడలేదు. యాదాద్రి జిల్లాలోని పతంగి టోల్‌ఎ÷-లాజా వద్ద ఈ ఘటన జరిగింది. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపు కోల్పోయి.. ముందువరుసలో ఉన్న మూడు కార్లను ధ్వంసం చేసింది. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదు. ఒక్కసారిగా బస్సు బ్రేక్ ఫెయిలవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆర్టీసీ బస్సు డ్రైవర్ చెప్తున్నారు. ఇదిలావుంటే పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ కొనసాగుతోంది. హైదరాబాద్ వెళ్లే వైపు దారుల్లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నాన్ ఫాస్టాగ్ వాహనాలకు రెండు క్యాష్ కౌంటర్ గేట్ల ద్వారా అనుమతి ఇస్తున్నారు. నాన్ క్యాష్ కౌంటర్ దారుల్లో వాహనాలు బారులు తీరగా, ఫాస్టాగ్ దారుల్లో రద్దీ సాధారణంగా ఉంది. ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి, రాకపోకలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం టోల్ ప్లాజాల దగ్గర వాహనాలకు ఫాస్టాగ్‌లను తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. డిసెంబర్ 1 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది.

## 20న మంత్రి కేటీఆర్ దావోస్ పర్యటన

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. దావోస్‌లో నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గనేందుకు మంత్రి కేటీఆర్ ఈనెల 20 న స్విట్జర్లాండ్ బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు ప్రపంచ దేశాల పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు హాజరుకానున్నారు

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ జోరు

### ప్రచారంలో దూసుకుని పోతున్న గులాబీ నేతలు

### అభివృద్ధి కొనసాగాలంటే టిఆర్ఎస్‌నే గెలిపించాలి

### ప్రచారంలో మంత్రి సత్యవతి, ఎంపి నామా విజ్ఞప్తి

ఖమ్మం,జనవరి18(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మంత్రులు ,ఎంపి,ఎమ్మెల్యేలు పట్టణాలు చుట్టేస్తునారు. అధికార పార్టీకి ఓటేస్తేనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయని చెబుతున్నారు. అధికార టీఆర్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు వార్డులను చుట్టివస్తూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మొదలుకొని సాయంత్రం 5 గంటల వరకు నిర్విరామంగా ఓటర్లను కలుస్తూ తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోత్ హరిప్రియా నాయక్ ప్రతీ రోజు సాధ్యమైనన్ని వార్డులు తిరుగుతూ ఓపెన్ జీపుపై రోడ్ నిర్వహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రసంగిస్తూ ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి కొనసాగాలంటే టి.ఆర్.ఎస్ పార్టీకే ఓటయ్యాలని, అవకాశం రాక పార్టీ మారిన అభ్యర్థుల మాటలు పట్టించుకోవద్దని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా శుక్రవారం ఆమె ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, స్థానిక నేతలతో కలిసి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో రాష్ట్రంలో మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. టి.ఆర్.ఎస్ రాకముందు ఇల్లెందు ఎలా ఉంది, కేసీఆర్ నాయకత్వంలో టి.ఆర్.ఎస్ పాలనలోఎలా అభివృద్ధి అయ్యిందో ప్రజలే గమనించాలని కోరారు. గత 5 ఏళ్లలో ఇల్లెందు కు 125 కోట్ల రూపాయల నిధులు వచ్చాయన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే ఇంకా కొనసాగాలంటే టి.ఆర్.ఎస్ పార్టీకే ఓటేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో టి.ఆర్.ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఈ ఎన్నికల్లో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు టి.ఆర్.ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రతిపక్ష పార్టీలకు పోటీ చేయడానికి అభ్యర్థులు లేరని, ఇక అభివృద్ధి వాళ్లతో అయ్యేదేమి లేదన్నారు. వాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఇల్లెందు ఒక బొగ్గుట్ట అని, ఇక్కడ దేశంలోని అన్ని ప్రాంతాల వాళ్ళు నివసిస్తా...దీనిని మినీ ఇండియా చేశారన్నారు. అందుకే విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధి చేస్తున్న టి.ఆర్.ఎస్ పార్టీకే ఓటయ్యాలని, ఇక్కడ 24 వార్డులకు 24 వార్డులలో గులాబీ పార్టీనే గెలిపించాలని కోరారు.

### జిల్లా పూర్తిస్థాయి అభివృద్ధికి గెలిపించాలి

జిల్లా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే అన్ని మునిసిపాలిటీల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని ఎంపి నామా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు శుక్రవారం మునిసిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తగూడెంలోని 22, 26, 32 వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్తు వైస్ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, పార్టీ న నేతలు వనమా రాఘవ, తుళ్ళూరి బ్రహ్మం, కిలారు నాగేశ్వరరావు, స్థానిక నేతలు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులతో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం వరకు మాత్రమే ప్రచార గడువు ఉండటంతో తిండితిప్పలు మాని తమ వార్డులను చుట్టివస్తున్నారు. వార్డులలో ప్రధానమైన మౌలిక సమస్యలను ఎజెండాగా తీసుకొని వీటన్నింటినీ నెరవేరుస్తామని హామీలిస్తూ అధికార టీఆర్ పార్టీ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. పట్టణ ప్రాంత ప్రజలు కూడా అధికార పార్టీని ఆదరించి తమ వార్డులను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో పాటు జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, టీఆర్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే తనయుడు వనమా రాఘవేందర్ జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ ఇల్లెందు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్, ఎన్నికల ఇన్‌ఛార్జి తాతా మధుతో పాటు ఖమ్మం కార్పొరేటర్లు వార్డులను తిరుగుతూ అధికార టీఆర్ పార్టీకి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

# సాయి జన్మస్థలంపై రాజుకున్న వివాదం

### పత్రి అభివృద్ధికి వంద కోట్ల కేటాయింపుతో రచ్చ

### షిర్డి బంద్‌కు పిలుపునిచ్చిన గ్రామస్థులు

షిర్డి,జనవరి18(ఆర్ఎన్ఎ): సాయి జన్మభూమి వివాదం ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల్లో కాక పుట్టిస్తోంది. మహారాష్ట్ర ప్రభుత్వం షిర్డీకి బదులు సాయిజన్మస్థలంగా పేరున్న పత్రి గ్రామంలోని ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చేసిన ప్రకటన నేపథ్యంలో షిర్డీలో ఆగ్రహ జ్వాలలు మిన్నుముడుతున్నాయి. ఉద్దవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన సర్కార్ పత్రి ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు కూడా విడుదల చెయ్యటంతో షిర్డీ వాసులు ఆదివారం బంద్‌కు పిలుపునిచ్చారు. మరాఠా సీఎం ఉద్దవ్ థాక్రే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూబంద్ పాటించనున్నట్టు తెలిపారు. షిరిడీ ఆలయం కూడా మూసివేయ్యలని నిర్ణయం తీసుకున్నారు. అయితే షిరిడీ ఆలయం తెరిచే ఉంటుందని, బంద్ కొనసాగినా ఆలయం మూసివేయమని ఆలయ ట్రస్ట్ సభ్యులు చెప్పున్నారు. దేశ నలుమూలల నుంచి మాత్రం కాకుండా విదేశాల నుంచి పెద్ద ఎత్తున దర్శించుకునే పవిత్ర పుణ్యక్షేత్రాలలో షిర్డీ సాయి బాబా ఆలయం ఒకటి. నిత్యం లక్షలాది మంది భక్తులు షిర్డీ సాయినాధుని దర్శనం కోసం వెళ్తూ ఉంటారు. అలాంటి సాయినాధుని జన్మస్థలం విషయంలో మహారాష్ట్ర సర్కార్ తీసుకున్న నిర్ణయంతో వివాదం రేగింది. పర్భణీ జిల్లాలోని పత్రి అనే ఊరు సాయిబాబా జన్మస్థలమన్న ప్రచారం ఎప్పటినుంచో ఉంది. కానీ దీనిపై షిర్డీ గ్రామస్థులు అభ్యంతరం తెలుపుతున్నారు. షిరిడీ కాకుండా పత్రి ఆలయ అభివృద్ధికి మహా సర్కార్ నిర్ణయంతో షిరిడీ వాసుల ఆగ్రహం చెందుతున్నారు. అయితే పత్రి లోని ఆలయాన్నే అభివృద్ధి చేస్తామని మహారాష్ట్ర సీఎం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేటి నుంచి నగర నిరవదిక బంద్ కు పిలుపునిచ్చారు షిర్డీ వాసులు. దీంతో బాబా దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. షిర్డీ వాసుల నిర్ణయంతో తమకు సంబంధం లేదంటున్నారు సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు. షిర్డీ సాయిబాబా ఆలయం మూసివేస్తున్నట్టు వస్తున్న కథనాలపై భక్తులు ఆందోళన చెందవద్దని ఆలయ ట్రస్ట్ సూచించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామని కూడా పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై షిరిడీ గ్రామస్థులతో ఈరోజు సాయంత్రం చర్చిస్తామని ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. షిర్డీ గ్రామస్థులు చేసే నిరసనకు ఆలయానికి సంబంధం లేదన్నారు. షిరిడీ సాయి నాధుని కోసమే ఆందోళన చేస్తున్నప్పటికీ ఆలయం మూసివేత నిర్ణయం సరైనది కాదని ట్రస్ట్ భావిస్తుంది. షిర్డీ ఆలయం నిరవధికంగా మూసివేస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వెంటనే స్పందించిన ట్రస్ట్ ఈ నిర్ణయం ప్రకటించింది. ప్రభుత్వం తీసుకునే ఇలాంటి నిర్ణయాల వల్ల షిర్డీ ఆలయానికి ఆదాయం తగ్గిపోతుందన్న భావన వ్యక్తం అవుతుంది.

# రైల్వేల్లో ఇక ఎంటర్‌టెయిన్‌మెంట్

### సౌకర్యాలను తెచ్చే పనిలో రైల్వేశాఖ

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): కొద్దిరోజుల్లో రైల్వే ప్రయాణంలో వినోదం భాగంకానుంది. సినిమాలు, మ్యూజిక్ వీడియోలు, జనలర్ ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్‌స్టయిల్ తదితర ఫీచర్స్‌తో జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు సంబంధించిన మార్గో నెట్‌వర్క్ ముందుకురానుంది. ప్రీమియం, ఎక్స్‌ప్రెస్, మేయిల్ సర్వీసులతోపాటు సబర్బన్ రైళ్లతో పాటు స్టేషన్లలో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రామ్స్ ను అందించనున్నారు. రైళ్లలో లేదా ప్లాట్‌ఫారం మీద ఎల్ఈడీ తెరలతో పాటు పర్సనల్ డివైస్‌కు కోరుకున్న కంటెంట్‌ను ఉన్నత ప్రమాణాలతో అందించనున్నారు. కంటెంట్ డిమాండ్ ఆన్ సర్వీస్(సీఓడీ)లో భాగంగా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. దీనికోసం రైల్‌టెల్ సంస్థతో మార్గో నెట్‌వర్క్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 10 ఏండ్ల ఒప్పందంతో సేవలు అందించనుంది. రెండేండ్ల కాలంలో ఈ ప్రాజెక్టును ప్రయాణికులకు అందుబాటులోకి తేవాల్సి ఉంటుంది. కదిలే రైళ్లలో డాటా పనిచేయక ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఇటువంటి వాటికి స్థానం లేకుండా నిరంతరాయంగా సర్వీసులను అందుకునే వెసులుబాటును రైల్‌టెల్ ద్వారా మార్గో నెట్‌వర్క్ అందించనుంది. హై క్వాలిటీ బఫర్ ఫ్రీ ఏరియాతో మొబైల్, ల్యాప్‌టాప్ వంటి వాటికి కనెక్ట్ చేసుకుని సినిమాలు, వీడియో సాంగ్స్, గేమ్స్ వంటివాటిని డౌన్లోడ్ చేసుకుని ఆనందం పొందే వీలుంటుందని రైల్‌టెల్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంఎంటీఎస్ రైళ్లలో కూడా అందుబాటులోకి వస్తుంది. 2022 వరకు ఇది అందుబాటులోకి వస్తుందని రైల్‌టెల్ సీఈఓ పునీత్ చావ్లా తెలిపారు. భారతీయ రైల్వేలోని 17 జోన్లలోని రైళ్లు, స్టేషన్లలో ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ సౌకర్యం దేశవ్యాప్తంగా 8731 వివిధ రైళ్లతో పాటు వై÷ సౌకర్యం ఉన్న 5563 స్టేషన్లలో వినోదభరితమైన కార్యకలాపాలు అందుతాయని తెలిపారు. ఐతే అడ్వై÷-టగ్మ÷జ్‌మెంట్లు, సబ్‌స్క్రిప్షన్ ద్వారా ఆదాయం సమపార్జించే ఆలోచనతో ముందుకు వెళ్తున్నది.

# మూడు రాజధానులపై వెనక్కి తగ్గాల్సిందే

### అమరావతిని మారిస్తే కేంద్రం చూస్తూ ఊరుకోదు

### సరైన సమయంలో జోక్యం చేసుకుంటుంది

### వైకాపా అభివృద్ధిపై దృష్టి సారించాలి: సుజనాచౌదరి

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): వైకాపా ప్రభుత్వం మూడు రాజధానులపై ముందుకెళ్తే కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని భాజపా ఎంపీ సుజనాచౌదరి స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రాజధాని మారిస్తే చూస్తూ ఊరుకోమని, రాష్ట్ర ప్రజల తరఫున పోరాడతామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం సరైన సమయంలో జోక్యం చేసుకుంటుందని సుజనాచౌదరి తెలిపారు. శనివారం దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎంలు మారినప్పుడల్లా రాజధాని మారుతుందా అని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే ఎవరూ ఊరుకోరని అన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. అధికారంలో ఎవరు ఉంటే వారికి అనుగుణంగా అధికారులు పనిచేయడం సరికాదన్నారు. అమరావతిని చూసే ఎయిమ్స్, నిఫ్ట్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు వచ్చాయని తెలిపారు. హైకోర్టు, సచివాలయం, రాజ్‌భవన్ వంటివి ఒకే చోట ఉండాలని విభజన చట్టం సెక్షన్-6లో స్పష్టంగా ఉందన్నారు. అమరావతి రాజధానిగా అనుకున్నప్పుడు వైసీపీ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. అమరావతికి కేంద్రం రూ.2500 కోట్లు ఇచ్చిందని తెలిపారు. ప్రజల సొమ్మును వృథా చేస్తామంటే ఊరుకునేదిలేదని సుజన హెచ్చరించారు. రాజధాని తరలింపు నిర్ణయాన్ని వైసీపీ ఉపసంహరించుకోవాలన్నారు. 13 జిల్లాల అభివృద్ధిపై వైసీపీ దృష్టి సారించాలని సూచించారు. జగన్ పాలనపై దృష్టిపెట్టి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని హితవుపలికారు. రాజధాని అమరావతి కోసం ప్రజా ఉద్యమమే కాదు... న్యాయపరంగానూ ముందుకెళ్తామని బీజేపీ నేత సుజనాచౌదరి స్పష్టం చేశారు. అమరావతిలో జరుగుతున్న పరిణామాలను కేంద్రం పరిశీలిస్తోందని తెలిపారు. అధికార ప్రకటన వెలువడిన తర్వాత కేంద్రం జోక్యం చేసుకుంటుందని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న చర్యతో వైసీపీ ప్రజాప్రతినిధులే సంతోషంగా లేరన్నారు. రాజధాని ఒక ప్రాంతానికి సంబంధించిన అంశం కాదని సుజన అన్నారు. సీఎం పదవిలో ఎవరున్న ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని నమ్మి భూములు ఇచ్చారని, చంద్రబాబుని చూసి కాదని అన్నారు. రాజధాని ఒక్క అంగుళం కూడా జరగదని స్పష్టం చేశారు. అమరావతి తరలింపు నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే పరిస్థితి వస్తుందని సుజనాచౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా వైకాపా ప్రభుత్వం పరిపాలనపై దృష్టిపెట్టాలన్నారు. అమరావతి తరలింపుపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. కొందరు రైతులు ఆందోళనతో చనిపోయారు. అమరావతి తరలింపును అందరూ వ్యతిరేకించాలి. సీఆర్డీఏను తొలగించేందుకు ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. రాజు మారినప్పుడల్లా రాజధానిని మారుస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తే కోర్టులు జోక్యం చేసుకునే అవకాశం ఉంది. గతంలో ఇచ్చిన తీర్పులే ఇందుకు ఉదాహరణ. రాజధాని తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని 13 జిల్లాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలనే దానిపై ఆలోచిస్తే మంచిది. మనీ బిల్లుగా సీఆర్డీఏని తీసుకొస్తామంటే అయ్యే పనికాదు. అమరావతిలో పరిణామాలను కేంద్రం పరిశీలిస్తోంది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత కేంద్రం జోక్యం చేసుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో వైకాపా ప్రజాప్రతినిధులే సంతోషంగా లేరు. సీఎం పదవిలో ఎవరు ఉన్నా ప్రజాస్వామ్య పద్ధతిలోనే వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రభుత్వాన్ని నమ్మి రైతులు భూములు ఇచ్చారు. రాజధాని ఒక్క అంగుళం కూడా జరగదు. అమరావతి తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే పరిస్థితి తలెత్తుతుంది. ఉత్తరాంధ్ర కూడా అభివృద్ధి చెందాలి, అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సుజనా చౌదరి అన్నారు.

## అదృశ్యమైన యువతి శవం గుర్తింపు

### చికాగోలో మిస్టరీగా భారత సంతతి యువతి మృతి

చికాగో,జనవరి18(ఆర్ఎన్ఎ): భారతీయ సంతతికి చెందిన ఓ అమ్మాయి అమెరికాలో శవమై తేలింది. గత డిసెంబరులో కనిపించకుండాపోయిన సురీల్ దాబావాలా అనే 33 ఏళ్ల యువతి శవమై తేలింది. చికాగోలోని లయోలా యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్న సురీల్ డిసెంబరు 30న అదృశ్యమైంది. ఆమె తండ్రి అష్రాఫ్ దాబావాలా పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా తన కుమార్తె ఆచూకీ తెలిపిన వారికి 10 వేల డాలర్ల రివార్డు కూడా ప్రకటించారు. తాజాగా తన సొంత కారులోనే విగతజీవిగా పడివున్న సురీల్ ను ఓ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీ గుర్తించింది. చికాగో పరిసరాల్లో కారు ఢిక్కీలో సురీల్ మృతదేహం దుప్పట్లో చుట్టి ఉంది. సురీల్ డెడ్ బాడీని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం కోసం తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తే కేసులో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

## ఆధార్ ఉంటేనే బాధితులకు సాయం

### ఆయా రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): ఉగ్రదాడులు, మావోయిస్టుల హింస, మత ఘర్షణల్లో బాధితులు కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందాలంటే ఇక ఆధార్ తప్పనిసరి. ఈ మేరకు కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది. సీమాంతర కాల్పులు, మందు పాతర, ఐఈడీ పేలుళ్ల ఘటనల్లో బాధితులుగా మారినవారికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని కేంద్రహోంశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ తెలిపింది. ఆయా బాధితులకు ఆర్థిక సాయం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం కింద లబ్ది పొందాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉండాలని తెలిపింది. ఒకవేళ ఆధార్ లేకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఇక ఈ నిబంధన అస్సాం, మేఘాలయ మినహా.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలులో ఉంటుందని కేంద్రం ప్రకటించింది. ఆధార్ దరఖాస్తు సెంటర్ లేకుంటే, బాధితులకు ఆర్థిక సాయం అందించే విభాగం ఆ సదుపాయాన్ని కల్పించాలని తెలిపింది.

## టీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి

### - గెలుపు కోసం టీబీజీకేఎస్ ప్రచారం

భద్రాద్రి కొత్తగూడెం,జనవరి18(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ప్రచారం ముమ్మరం చేసింది. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు ముప్పాని సోమిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో కార్మికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి అధికార టీఆర్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీఆర్ పార్టీ తరపున సింగరేణి కార్మికుల సతీమణులు, బంధుమిత్రులు పోటీ చేస్తున్న నేపథ్యంలో కార్మికలోకం టీఆర్ మద్దతు తెలపాలని వారు పిలుపునిస్తున్నారు. టీఆర్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం కేసీఆర్ కార్మికులకు అత్యధిక బోనస్ పాటు లాభాల్లో 28 శాతం వాటా ఇచ్చి కార్మికుల పక్షపాతిగా నిలిచారు. అంతేకాకుండా కారుణ్య నియామకాలకు అనుమతిస్తూ కార్మికులను అక్కున చేర్చుకున్నారని, అటువంటి టీఆర్ పార్టీని అత్యధిక మెజార్టీతో మున్సిపాలిటీలో గెలిపించుకొని కోల్ ఏరియాను అభివృద్ధి చేసుకుందామని వారు సమావేశాలు నిర్వహిస్తూ ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు.

## మంత్రి అల్లోల సమక్షంలో గులాబీ గూటికి చేరిన అప్పాల వంశీ



నిర్మల్, జనవరి 18 : నిర్మల్ పట్టణంలో టీఆర్ఎస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. విపక్ష పార్టీ నాయకులు ఒక్కొక్కరు గులాబీ గూటికి చేరుతుండటంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు బేజారైపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ నేత, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ సమీప బంధువు అప్పాల వంశీ కాంగ్రెస్ ను వీడి అనుచరులతో కారెక్కారు. దీంతో నిర్మల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అప్పాల వంశీ, ఆయన అనుచరులకు మంత్రి అల్లోల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాంకిషన్ రెడ్డి, గంగ్రత్ ఈశ్వర్, అల్లోల గౌతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హాజీపూర్ హత్యల కేసులో 27న తీర్పు

### -తీర్పు వెలువరించనున్న పోక్సో కోర్టు

నల్గొండ,జనవరి18(ఆర్ఎన్ఎ): నల్గొండ జిల్లా హాజీపూర్‌లో బాలికల హత్యల కేసులో ఈ నెల 27 న తీర్పు వెలువడనుంది. నల్లగొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ న్యాయస్థానం (పోక్సో కోర్టు) తీర్పు వెలువరించనుంది. ముగ్గురు బాలికలను హత్య చేసినట్లు శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. మరో రెండు హత్యల కేసుల్లో వాదనలు వినకుండానే కోర్టు తీర్పు తేదీని వెలువరించడం గమనార్హం. రెండు నెలలుగా కొనసాగిన విచారణలో సాక్షులను, సాంకేతిక నిపుణులు చెప్పిన విషయాలను కోర్టు పరిశీలించింది. ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన 100 మందికి పైగా సాక్షులను విచారించింది. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణలో శ్రీనివాస్ రెడ్డి విచిత్రంగా స్పందించాడు. న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు 'కావచ్చు, నాకు తెలియదు, అంతా అబద్ధం' అనే మాటలు మాత్రమే చెప్పాడు.

## అన్ని మున్సిపాలిటీల్లో గెలుపు మాదే

### జనగామ అభివృద్ధికి ఓటేయండి: ముత్తిరెడ్డి

జనగామ,జనవరి18(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఈ ఎన్నికల్లో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అధికార పార్టీ కైవసం చేసుకుంటుందని జజనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ప్రతిపక్ష పార్టీలకు పోటీ చేయడానికి అభ్యర్థులు లేరని, ఇక అభివృద్ధి వాళ్లతో అయ్యేదేమి లేదన్నారు. వాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. అభివృద్ధి కొనసాగాలంటే అధికార పార్టీకే ఓటయ్యాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఎమ్మెల్యే పలు డివిజన్లలో ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో రాష్ట్రంలో మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అభివృద్ధి ఇలాగే ఇంకా కొనసాగాలంటే గులాబీ పార్టీకే ఓటేసి గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుందన్నారు. జనగామను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బీజేపీకి దమ్ము ధైర్యం ఉంటే కేంద్రం నుండి మున్సిపాలిటీలకు నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రతి మున్సిపాలిటీకి రూ.20 కోట్ల నిధులు కేటాయించిన ఘనత టీఆర్ఎస్ పార్టీదే అని అన్నారు. జిల్లా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే టీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## అమెజాన్‌పై వ్యాఖ్యలు వక్రీకరణ: మంత్రి గోయల్




న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): అమెజాన్ సంస్థ భారత్‌లో భారీ పెట్టుబడులు పెట్టనున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిటన్లు విమర్శలు వస్తున్నాయి. అయితే తన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారని మంత్రి గోయల్ అన్నారు. అన్ని నిబంధనల మధ్య పెట్టుబడులను ఆహ్వానిస్తామని మంత్రి చెప్పారు. వేల కోట్ల పెట్టుబడులతో చిన్నవర్తకులను దెబ్బతీయకూడదన్నారు. పెట్టుబడుల విషయంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగితే, అప్పుడు చట్టం ప్రకారమే వెళ్తామన్నారు. అమెజాన్ సంస్థపై తప్పుడు అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తనపై విమర్శలు వస్తున్నాయని, కానీ తాను అలా మాట్లాడలేదని మంత్రి గోయల్ తెలిపారు. దేశంలో ఈ-కామర్స్ కోసం కొన్ని చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాలకు లోబడే ఇన్వెస్ట్‌మెంట్ జరగాలన్నారు.

10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తా: జెఫ్ బెజోస్

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఇండియాలో పర్యటించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే భారత్‌లో సుమారు పది లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు జెఫ్ బెజోస్ తెలిపారు. 2025లోగా ఆ ఉద్యోగాలను ఇవ్వనున్నట్లు.. బెజోస్‌కు చెందిన ద వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తన కథనంలో పేర్కొన్నది. 2025కల్లా భారత్‌లో తయారైన 10 బిలియన్ డాలర్ల విలువైన వస్తూత్పత్తుల ఎగుమతి లక్ష్యాన్నీ నిర్దేశిరచుకున్నట్లు ఆయన తెలిపారు. దీనితో పాటు అదనంగా సుమారు 10 లక్షల ఉద్యోగాలను కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌కు వచ్చిన ప్రతిసారీ.. ఆ దేశంపై ప్రేమ పెరుగుతోందని, భారతీయుల్లో ఉన్న తపన, ఉత్సాహం, పట్టుదల తనకు ఎప్పుడూ ప్రేరణగా నిలుస్తుందన్నారు. భారత్‌లో ఉన్న చిన్న, మధ్య తరహా వ్యాపారాలను డిజిటైజ్ చేసేందుకు బిలియన్ డాలర్ల పెట్టుబడికి గతంలోనూ అంగీకారం తెలిపారు.

# సింగూరుకు గోదావరి జలాలు తరలిస్తాం

## కాళేశ్వరం పూర్తితో నెరవేరనున్న కల
## సంగారెడ్డి అభివృద్ధికి తానే ముందుంటా
## ప్రచారంలో మంత్రి హరీష్ రావు

సంగారెడ్డి,జనవరి18(నేటినిజం ప్రతినిధి): అభివృద్ధికి, అభివృద్ధి నిరోధకులకు మధ్య మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయని, అభివృద్ధికి అడ్డుపడే వారికి ఓటు వేయొద్దని రాష్ట్ర మంత్రి హరీష్ రావు ఓటర్లను కోరారు.



సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి హరీష్ రావు. చిత్రంలో మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా ఉన్నారు

సంగారెడ్డి మున్సిపాలిటీలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. గెలిచే పార్టీ టీఆర్ఎస్ అన్నారు. ఏ పార్టీతో మనకు పొత్తు లేదన్నారు. నూటికి నూరు శాతం టీఆర్ఎస్ అభ్యర్థే మున్సిపల్ ఛైర్మన్ అవుతారని స్పష్టం చేశారు. ఒంటరిగానే 30 వార్డులు గెల్చుకుంటా మన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు తెచ్చి ఇచ్చే బాధ్యత తనదన్నారు. కాళేశ్వరం నీళ్లు మూడు నాలుగు నెలల్లో వస్తాయన్నారు. మంజీరలో వర్షాలు పడలేదు. అందుకే సీఎం కేసీఆర్ సింగూరుకు గోదావరి జలాలు తేవాలని నిర్ణయించారన్నారు. గోదావరి జలాలతో సింగూరు దాహార్తి తీరుస్తామన్నారు. సీఎం కేసీఆర్ మాట తప్పని, మడమ తిప్పని నేత అన్నారు. మిగతా వారితో పనులవుతాయా అని అన్నారు. టీఆర్ఎస్‌ను గెలిపించండి.. సంగారెడ్డిని దత్తత తీసుకొని అన్ని వార్డులు తిరిగి సమస్యలు పరిష్కరిస్తా అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టనున్నారు. పల్లె ప్రగతి ద్వారా పల్లెల రూపురేఖలు మారాయి. ఎన్నికల తర్వాత పట్టణ ప్రగతిలో తాను సంగారెడ్డిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేస్తానన్నారు. ఓ పెద్దమనిషిని గతంలో మున్సిపల్ ఛైర్మన్ చేస్తే ఆరుగురి ఉద్యోగాలు పోయాయి. నలుగురు చనిపోయారు. సస్పెండ్ అయ్యారు. కోర్టుల చుట్టూ తిరిగారు. అలాంటి వ్యక్తులకు ఓటు వేస్తారా... నిజాయితీగా పని చేసే వారికి ఓటు వేస్తారా. పని చేసేవారికి ఓటువేయండి. వచ్చే నాలుగేళ్లు టీఆర్ఎస్ ప్రభుత్వమే ఉంటుంది. అభివృద్ధికి సహకరించే టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి, విస్తరణ జరుగుతన్న ప్రాంతం సంగారెడ్డి మున్సిపాలిటీ అని హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో మన పథకాలను అమలు చేసుకుంటున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. మిషన్‌భగీరథతో ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని అందజేస్తున్నామన్నారు. ఔటర్ రింగురోడ్డుకు లోపల ఉన్న ప్రాంతాలకు హెచ్‌ఎం డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటిని సరఫరా చేయబోతున్నామని తెలిపారు. ఓటింగ్‌లో పాల్గొని రైట్ పర్సన్‌ను ఎన్నుకుంటే ప్రజాసామ్యం బాగుంటుందని, లేదంటే ఐదేండ్లు మనం సమస్యలను అనుభవించాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు.

సీఎం కేసీఆర్ సారథ్యంలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి బాటలో పయణిస్తున్నాయని చెప్పారు. పట్టణ వాసుల అవసరాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో మౌలికసదుపాయాల కల్పన జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తామెప్పుడు ముందుంటామన్నారు. నూతన మున్సిపాల్ చట్టంతో అనేక మార్పులు రాబోతున్నాయన్నారు. విద్యావంతులందరూ ఓటింగ్‌లో పాల్గొని సరియైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ దూకుడు

## జోరుగా ప్రచారం చేపట్టిన నేతలు
## వార్డుల్లో తిరుగుతూ పథకాల ప్రచారం

ఖమ్మం,జనవరి18(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కారు దూకుడు పెంచింది.. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో గులాబీ జెండాను ఎగురవేసేందుకు టీఆర్ఎస్ నాయకులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నారు. ఎంపీ నామా నాగేశ్వరరావు ఎమ్మెల్యేలు రాములునాయక్ , సండ్ర వెంకట వీరయ్య, హరిప్రియా నాయక్ తదితరులు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని ప్రస్తుత ఎన్నికలు జరుగుతున్న మూడు మున్సిపాలిటీలపై గులాబీ జెండాను ఎగురవేసే లక్ష్యంతో టీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. జిల్లాకు చెందిన నాయకులు టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించే లక్ష్యంతో ప్రచారంలోకి వెళ్లారు. పలు వార్డుల్లో పర్యటించి టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించే లక్ష్యంతో ప్రచారం నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లిలో ప్రచారం నిర్వహించగా, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వైరా మున్సిపాలిటీలో, జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు మధిర మున్సిపాలిటీలో ప్రచారం చేపట్టారు. వీరితో పాటు టీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

టీఆర్ఎస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులను కౌన్సిలర్లుగా గెలిపించడం ద్వారా సీఎం కేసీఆర్ పాలనకు మద్దతు పలికిన వారవుతారని, టీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన అందుతుందని ఖమ్మం ఎంపీ, టీఆర్ఎస్ లోకసభా పక్షనేత నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం మేయర్ గుగులోత్ పాపాలాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో పోటీ చేస్తున్న టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. నామా నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రానున్న రోజుల్లో పట్టణ ప్రణాళికను ప్రవేశపెట్టి పట్టణాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుందన్నారు. సీఎం కేసీఆర్ ఆరేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వలన అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీకి ప్రభుత్వం వేల కోట్ల రూపాయాలను కేటాయించిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని గెలుపించడం ద్వారా నిధులు వస్తాయని, తద్వారా మధిర మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపాలి టీలోని అన్ని వార్డుల్లో శానిటేషన్, రహదారులు విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

# నేటి నుంచి కొమురవెల్లి మల్లన్నజాతర

## పది వారాల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
## నేడు పట్నువారంతో జాతరకు శ్రీకారం
## భారీగా ఏర్పాట్లు... బందోబస్తు

సిద్దిపేట,జనవరి18(ఆర్ఎన్ఎ):చారిత్రక నేపథ్యం కలిగిన కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం పట్నంవారానికి ముస్తాబైంది. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జునుడి దివ్యక్షేత్రం పట్నంవారానికి ముస్తాబైంది. సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తారు. మరుసటిరోజు పెద్దపట్నం, అగ్నిగుండాలు నిర్వహిస్తారు. పోతరాజుల చిందులు, భక్తుల జయ జయధ్వానాలు, డప్పు చప్పుళ్ల మధ్య శివ సత్తుల పూనకాలతో కొమరవెల్లి విజయాచల గుట్టలు ఆదివారం నుంచి మారుమోగనున్నాయి. గత డిసెంబరు 22న నిర్వహించిన కళ్యాణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్నంవారంతో మూడు నెలలపాటు జానపదుల జాతర ప్రారంభం కానుండటంతో 10 వారాల పాటు ప్రతీ ఆదివారం వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. మార్గశిర మాసం చివరి ఆదివారం రోజు నిర్వహించనున్న కల్యాణంతో మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈక్రమంలో సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తారు. మరుసటి సోమవారం రోజున హైదరాబాద్‌కు చెందిన యాదవ పూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. తరువాత వచ్చే ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు. పట్నం వారానికి లక్షలాది భక్తులు తరలిరానుండడంతో ఆలయ కమిటీ పక్కా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా త్వరగా దర్శనమయ్యేలా ప్రత్యేక క్యూలైన్లతోపాటు తాగునీటి వసతి, పార్కింగ్ సౌకర్యం కల్పించారు. పట్నంవారానికి వచ్చిన భక్తులు మరుసటిరోజు పెద్దపట్నం,అగ్నిగుండం కార్యక్రమాల్లో పాల్గొంటారు. 10 వారాలపాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు సకల వసతులు కల్పిస్తున్నామని ఆలయ పునరుద్ధరణ కమిటీ ఛైర్మన్ మేక సంతోష్ తెలిపారు. భక్తుల పాలిట కొంగు బంగారంగా మల్లికార్జున స్వామి ఆలయం విరాజిల్లుతున్నంది. ఆలయ ఆచార, సంప్రదాయాల ప్రకారం సంక్రాంతి పర్వదినం పూర్తి అయిన తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి కల్యాణం, పట్నంవారం, లష్కర్‌వారం, మహా శివరాత్రిన నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాలు కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉత్సవాల సందర్భంగా ఆలయం, రాజగోపురం, గదులకు రంగులను వేయించడంతో మల్లన్న క్షేత్రం సుందరంగా మారింది. ఈ నెల 19న నిర్వహించే పట్నంవారంతో ఉత్సవాలు ప్రారంభమవుతుండడంతో బ్రహ్మోత్సవాల సమయం లో 10వ ఆదివారంతోపాటు, ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా స్వామిని దర్శించుకునేందుకు ఈ సంవత్సరం ప్రత్యేకంగా క్యూలైన్లలో నీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేశారు. అలాగే, విశిష్ట దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మ దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాటు చేయడంతోపాటు స్వామివారిని దర్శించుకున్న ఆనంతరం బయటకు వెళ్లే దారిలో ఏర్పాట్లు చేశారు. పట్నం వారం సందర్భంగా ఆదివారం అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. దీనికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్న పేరిట సట్టీ దీక్షలను 41 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో చేపట్టి, పట్నం వారంలో స్వామిని దర్శించుకున్న అనంతరం దీక్ష విరమించనున్నారు. నెల 20న స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయవర్గాలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లన్న ఆలయవర్గాల సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఒగ్గు పూజారులు పట్నం వేయడంతో పాటు అగ్నిగుండం తయారు చేసి దానిని దాటుతారు. ఈ మేరకు ఆలయంలోని శాశ్వత కల్యాణ వేదిక ముందు ప్రత్యేకంగా అగ్నిగుండం, పెద్దపట్నం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండం కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న ఆనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాల వద్దకు వెళ్లి అక్కడ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. 10 వారాల పాటు ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో సకల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. దేవాలయ రాజగోపురం నుంచి ఎల్లమ్మ అమ్మవారి కమాన్ వరకు 3క్యూలైన్లు షెడ్స్‌తో నిర్మించినట్లు తెలిపారు. క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా తాగునీరు అందించేందుకు నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు సేవలందించేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ అందుబాటులో ఉంటారని, వృద్ధులు, వికలాంగులకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్నం వేసే భక్తులు ధర్మదర్శనంలోకి ప్రవేశించకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే, ఎల్లమ్మ ఆలయ మహామండప పనులను పూర్తి చేస్తామన్నారు. బందోబస్తును సీసీ కెమెరాల నిఘాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# చైనాను వణికిస్తున్న కొత్త వైరస్

## మిస్టరీ వైరస్‌పై పరిశోధనలు మొదలు

బీజింగ్,జనవరి18(ఆర్ఎన్ఎ):చైనాలో ఓ కొత్త వైరస్ విజృంభిస్తున్నది. అంతుచిక్కని ఆ వైరస్ ప్రబలుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ముందుగా ఊహించిన దాని కన్నా ఎక్కువ స్థాయిలో ఆ కొత్త వైరస్ వ్యాప్తి చెందుతున్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మిస్టరీ వైరస్‌కు చెందిన కేసులను సుమారు 45 ల్యాబ్‌లలో ధ్రువీకరించారు. దాదాపు 1700 మందికి కొత్త వైరస్ సోకినట్లు భావిస్తున్నారు. ఈ వైరస్ వల్ల ఇప్పటి వరకు వుహన్ సిటీలో ఇద్దరు మృతిచెందారు. లండన్‌కు చెందిన కాలేజీ ఆ కొత్త వైరస్ పై పరిశోధనలు నిర్వహిస్తున్నది. వుహన్ సిటీ నుంచి వస్తున్న ప్రయాణికులను సింగపూర్, హాంగ్‌కాంగ్ విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ చేస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్‌కో, లాస్ ఏంజిల్స్, న్యూయార్క్ విమానాశ్రయా ల్లోనూ ఇదే తరహా చెకింగ్ చేస్తున్నారు. కొత్త వైరస్‌ను కోరోనా వైరస్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ వైరస్ వల్ల సాధారణ జలబు వస్తుంది. కానీ ఆ తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కొరోనా వైరస్ దాదాపు సార్స్ వైరస్‌కు దగ్గరగా ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ వైరస్ వల్ల తొందరగా నిమోనియా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# చిలకలూరిపేటలో విషాదం

## పెట్రోల్ బంకులో షాక్..ముగ్గురు మృతి

గుంటూరు,జనవరి18(ఆర్ఎన్ఎ): గుంటూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. చిలకలూరిపేటలోని ఓ పెట్రోల్ బంక్‌లో కరెంట్ షాక్‌తో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. పెట్రోల్ బంక్‌లో ఓ బల్బ్ పాడవడంతో దాన్ని మార్చేందుకు ఇనుప స్టాండ్‌ను తీసుకువస్తుండగా అది హైటెన్షన్ వైర్లకు తగిలింది. దీంతో ఐరన్ స్టాండ్‌ను పట్టుకున్న ముగ్గురు వ్యక్తులు కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు మౌలాలి(25), శ్రీనివాస రావు(40), శేఖర్(45)గా గుర్తిం చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి

# నిరాదరణకు గురైన వృద్ధ దంపతుల ఆత్మహత్య

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 18(ఆర్ఎన్ఎ): నిరాదరణకు లోనైన ఓ వృద్ధ జంట ఆత్మహత్యకు పాల్పడింది. భూపాలపల్లి జిల్లాలోని చిట్యాలకు చెందిన చెలిమల్ల రాజయ్య, లక్ష్మీ అనే దంపతులు బతుకు భారమై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారుడు, కోడలు తమ బాగోగులు చూసుకోవడంలేదన్న ఆవేదనతో, మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. మరణించిన వారి కుమారుడు, కోడల్ని పోలీసులు విచారిసున్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులకు తెలిపారు.

# కిలిమంజారో పర్వతారోహణకు మరో విద్యార్థిని ఎంపిక

మహబూబ్‌నగర్,జనవరి18 (ఆర్ఎన్ఎ): దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతారోహణకు మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడెం గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని లక్ష్మి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కే సత్యనారాయణరెడ్డి తెలిపారు. వారంపాటు కొనసాగే ఈ యాత్రకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఆమెను గురుకులాల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సన్మానించి వీడ్కోలు పలికారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం చెన్వార్ గ్రామానికి చెందిన లక్ష్మి బీకాం సెకండియర్ చదువుతున్నది.

# సర్పంచ్‌గా గెలిచిన 97ఏళ్ల బామ్మ

జయపుర,జనవరి18(ఆర్ఎన్ఎ): 97 ఏళ్ల ఓ బామ్మ సర్పంచ్‌గా గెలిచి రికార్డు సృష్టించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని నీమ్ కా థానా సబ్ డివిజన్, పురానాబాన్ గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 97 ఏళ్ల విద్యాదేవి అనే వృద్ధ మహిళ సర్పంచ్‌గా పోటీ చేసింది. ఈవిడేం గెలుస్తుందిలే అని ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు విషయాన్ని తేలికగా తీసుకున్నట్లున్నారు. కానీ, ఓట్ల లెక్కింపులో విద్యాదేవి సర్పంచ్‌గా గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. దీంతో గ్రామ ప్రజలు సర్పంచ్‌గా ఎన్నికైన బామ్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వయస్సులో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిని చిత్తుగా ఓడించిన బామ్మకు గ్రామ ప్రజలనుంచే గాక రాష్ట్రంలోని చాలా ప్రాంతాల నుంచి ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సర్పంచ్‌గా గెలిచిన బామ్మ.. గ్రామానికి సేవ చేయాలనే ఎన్నికల బరిలో నిలిచాననీ.. నన్ను గెలిపించినందుకు, తనకు మద్దతుగా నిలి చినందుకు ఓటర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# ప్రపంచంలో అతి పొట్టి వ్యక్తి మృతి

ఖాట్మండ్,జనవరి18 (ఆంఎన్ఎ):ప్రపంచంలోనే అతిపొట్టి వ్యక్తిగా పేరుగాంచిన ఖాగేంద్ర థాపా మగర్ మరణించాడు. గిన్నిస్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన థాపా మగర్ గత కొద్ది కాలంగా న్యూమోనియాతో భాద పడుతున్నాడు. ఆయన మరణించిన విషయాన్ని గిన్నిస్ రికార్డు యాజమాన్యం ధృవీకరించింది. ఖాగేంద్ర 14 అక్టోబర్, 1992లో బాగ్‌లంగ్ జిల్లా, నేపాల్‌లో జన్మించాడు. రూప్ బహదూర్, ధన్‌మాయలకు ఖాగేంద్ర పెద్ద కుమారుడు. 2010లో ప్రపంచంలోనే అత్యంత పొట్టి వ్యక్తిగా ఖాగేంద్ర గిన్నిస్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. కాగా, అతను 2011లో బాగా పాపులర్ అయ్యాడు. ఆ యేడాది ఖాగేంద్ర నేపాల్ టూరిజం గుడ్‌విల్ అంబాసిడర్‌గా నియమించబడ్డాడు. ఖాగేంద్రకు గిటార్ వాయించడమంటే చాలా ఇష్టం. అలాగే అతని సోదరులతో బైక్‌పై షికార్లు కొట్టేవాడని అతని తండ్రి రూప్ బహదూర్ ఆవేదనగా తెలిపాడు.

# దివంగత ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

## అంజలి ఘటించిన కుటుంబ సభ్యులు

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు నందరమూరి తారక రామారావు 24వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద పూలుచల్లి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ కుటుంబసభ్యులు.. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, రామకృష్ణ, సుహాసిని, దగ్గుబాటి పురందరేశ్వరీ, ఆమె కుటుంబసభ్యులు, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రమణ, పార్టీనేత రావుల చంద్రశేఖర్ రెడ్డి,ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రముఖ సినీ దర్శకులు వైవీఎస్ చౌదరి, రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న తదితరులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న మాట్లాడుతూ.. మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించిన మహానీయులు ఎన్టీఆర్ అన్నారు. ప్రస్తుతం మహిళపై జరుగుతున్న దాడులు చూసి ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ సారైనా ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించి, గౌరవించాలని కోరుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ట్విట్టర్ ద్వారా స్పందించారు. తెలుగువారికి గౌరవం తెచ్చిన నాయకుడు ఎన్టీర్ అని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్ దైవ సమానులని.. ఆయన సమాధి దేవాలయమని బీజేపీ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఎన్టీఆర్ 24వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద మోత్కుపల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ఏర్పడిన పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు. ఎన్టీఆర్ దారిలోనే బీజేపీ నడుస్తుందని.. అందుకే బీజేపీలో చేరానని చెప్పుకొచ్చారు. ఇప్పుడున్న పార్టీలన్నింటికీ ఎన్టీఆర్ మార్గదర్శి అని మోత్కుపల్లి తెలిపారు.



మంగళగిరిలో టిడిపి ప్రధాన కార్యలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన చంద్రబాబు, లోకేశ్, కళా వెంకట్రావ్ తదితరులు

# దవీందర్ సింగ్ కేసు విచారించనున్న ఎన్ఐఎ

## ఇప్పటికే అతనిపై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్ డీఎస్పీ దవీందర్ సింగ్ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ విచారించనున్నది. కేంద్ర హోంశాఖ నుంచి ఆదేశాలు అందిన నేపథ్యంలో.. దవీందర్ సింగ్‌పై విచారణకు ఎన్ఐఏ సిద్ధమైంది. డీఎస్పీపై కేసును నమోదు చేసి.. ఎన్ఐఏ విచారణ ప్రారంభించినట్లు పోలీసు ప్రతినిధి తెలిపారు. తన ఇంట్లో ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిన డీఎస్పీ దవీందర్, గత శనివారం వారితో కలిసి వాహనంలో ప్రయాణిస్తుండగా పోలీసు తనిఖీల్లో పట్టుబడి అరస్టైన విషయం తెలిసిందే. 48 గంటల పాటు పోలీస్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో సర్వీసు నిబంధనల మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నాలుగు నెలల కిందట రాష్ట్రపతి పోలీస్ మెడల్ పొందిన దవీందర్ సింగ్‌కు ఉగ్రవాదులతో ఉన్న సంబంధాలపై పోలీసులు, నిఘా అధికారులు ప్రశ్నిస్తున్నారు. కరుడుగట్టిన ఉగ్రవాదులను పట్టుకునేందుకు వారితో కలిసిపోయినట్లుగా నమ్మించేందుకు వారితోపాటు ఉన్నట్లు ఆయన చెప్పారు. అయితే దీనికి సంబంధించిన ప్రోటోకాల్‌ను పాటించనందున ఆయన మాటలను దర్యాప్తు అధికారులు నమ్మడం లేదు. నిషేధిత హిజ్బుల్ ముజాహిదీన్ జిల్లా కమాండర్ నవీద్ బాబా, మరో ఉగ్రవాది అల్తాఫ్‌ను, ఉగ్రవాదులకు సహకరించే న్యాయవాది ఇర్ఫాన్ గత శుక్రవారం దవీందర్ నివాసానికి తీసుకెళ్లాడు. ఆర్మీ 15 కార్ప్స్ ప్రధాన కార్యాలయానికి పక్కన ఉన్న ఆయన ఇంట్లో సోదాలు చేసిన పోలీసులు రెండు పిస్టల్స్, ఒక ఏకే రైఫిల్‌తోపాటు భారీగా మందుగుండును స్వాధీనం చేసుకున్నారు.

హైజాకింగ్ వ్యతిరేక విభాగంలో డీఎస్పీగా దవీందర్ విధులు నిర్వహిస్తుండటంతో శ్రీనగర్ ఎయిర్‌పోర్టులోని కార్యాలయాన్ని సీజ్ చేశారు. పార్లమెంట్‌పై ఉగ్రదాడికి పాల్పడిన కేసులో ఉరిశిక్షకు గురైన అఫ్జల్‌గురు రాసిన ఓ లేఖలో దవీందర్ ప్రస్తావన ఉన్నది. మరో నిందితుడైన మహ్మద్‌ను ఢిల్లీకి తీసుకెళ్లి అ÷-దదె ఇంట్లో ఉంచాలని, కారును కొనుగోలు చేయాలని నాడు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌లో డీఎస్పీగా ఉన్న దవీందర్ తనకు చెప్పినట్లు అఫ్జల్‌గురు ఆ లేఖలో పేర్కొన్నాడు. దర్యాప్తు చేసిన అధికారులు లేఖలోని అంశాలను బలపరిచే ఆధారాలను సంపాదించలేకపోయారు. ఎస్పీ ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్న దవీందర్‌కు ఉగ్రవాదులతో సంబంధం నేపథ్యంలో ఆయన పతకాలను వెనక్కి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

# కుటుంబ రాజకీయాలు తగవు

## రాహుల్‌ను మరోమారు ఎన్నుకుంటే తప్పు చేసినట్లే
## వయనాడ్ ప్రజలకు రామచంద్రగుహ సూచన
## మోడీకి కితాబు ఇచ్చిన చరిత్రకారుడు

తిరువనంతపురం,జనవరి18 (ఆంఎన్ఎ): కేరళలో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రముఖ చరిత్రకారుడు, కాలమిస్ట్, రచయిత రామచంద్ర గుహ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో రాహుల్‌ను గెలిపించి మలయాళీలు పెద్ద తప్పు చేశారంటూ విమర్శించారు. మళ్లీ 2024లో రాహుల్‌ను గెలిపిస్తే నరేంద్ర మోదీకి మేలు చేసినట్లు అని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా పోటీ చేసి రాహుల్ గెలిచారు. ఈ నేపథ్యంలోనే రామచంద్ర గుహ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా స్వయం శక్తితో ప్రధాని అయిన మోదీపై, ఐదోతరం యువరాజు రాహుల్ గాంధీ గెలవడం అసాధ్యమని గుహ అభిప్రాయపడ్డారు. 'భారత్ స్వయం శక్తితో ఎదిగిన మోదీని కోరుకుంటోంది. ఐదోతరం యువరాజు రాహుల్‌ను వద్దంటోంది' అని ఆయన అన్నారు. వీరిద్దరి మధ్య పోటీలో రాహుల్ గాంధీ ఎన్నో ప్రతికూలతలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. కాగా, ఇటీవలే సీఏఏకు వ్యతిరేకంగా నిరసన చేసినందుకు రామచంద్ర గుహను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో మోదీపై ఆయన ప్రశంసలు కురిపించడం గమనార్హం. 2024 ఎన్నికల్లో రాహుల్‌గాంధీని మళ్లీ ఎన్నుకుని మలయాళీలు తప్పు చేయకూడదని రామచంద్ర గుహ అన్నారు. కోజికోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ కామెంట్ చేశారు. ఇటీవల పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బెంగుళూరు లో రామచంద్ర గుహ ధర్నా చేశారు. అప్పుడు ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే కుటుంబ రాజకీయాలకు పాల్పడుతున్న రాహుల్(వయనాడ్ ఎంపీ) లాంటి నేతలకు అవకాశం ఇవ్వడం వల్లే బీజేపీ లాంటి పార్టీ బలపడిందన్నారు. దీంతో విధానపరమైన నిర్ణయాల్లో బీజేపీ ఎవర్నీ లెక్క చేయడం లేదన్నారు. తనకు రాహుల్ గాంధీపై ఎటువంటి వ్యక్తగత కక్ష లేదని, ఆయనో మంచి వ్యక్తి, సద్గుణాలు కలిని వ్యక్తే అని, కానీ యువ భారత్‌కు ఓ కుటుంబానికి చెందిన అయిదో తరం నాయకుడు అవసరం లేదని గుహ తెలిపారు. 2024లో రాహుల్‌కు ఓటేస్తే.. అప్పుడు అది మోదీకి అడ్వాంటేజ్‌గా మారుతుందని, అందుకే మలయాళీలు అలాంటి పొరపాటు చేయకూడదని చరిత్రకారుడు తెలిపారు.

# మహిళతో అక్రమ సంబంధం

## ఆమె కూతురుపైనా కన్ను
## అగ్రహంతో దాడిచేసిన బంధువులు

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): నగరంలోని సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి దారుణ సంఘటన చోటుచేసుకుంది. అక్రమ సంబంధం ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం? బోరబండకు చెందిన అజయ్ (30) మాదాపూర్‌లోని ఓ కాలేజీలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తూ, ఎస్సార్‌నగర్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూసాపేటకు చెందిన మహిళతో పరిచయం పెంచుకుని అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. అంతటితో ఆగకుండా ఆమె కూతురిని కూడా వేధించడం ప్రారంభించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శుక్రవారం సాయంత్రం మహిళ బంధువులు బోరబండలోని అజయ్ ఇంటికి వెళ్లి తీవ్రంగా కొట్టారు. గాయపడిన అతడిని ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అజయ్ మృతి చెందినట్టు డాక్టర్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# వృద్ధ దంపతుల ఆత్మహత్య..

జయశంకర్ భూపాలపల్లి, జనవరి18: నిరాదరణకు లోనైన ఓ వృద్ధ జంట ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళ్తే.. భూపాలపల్లి జిల్లాలోని చిట్యాలకు చెందిన చెలిమల్ల రాజయ్య, లక్ష్మీ అనే దంపతులు బతుకు భారమై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారుడు, కోడలు తమ బాగోగులు చూసుకోవడంలేదన్న ఆవేదనతో, మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. మరణించిన వారి కుమారుడు, కోడల్ని పోలీసులు విచారిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులకు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.